ఇక ప్రతి పంటకూ లెక్క

- కొనసాగుతున్న నమోదు ప్రక్రియ
- ఆన్‌లైన్‌లో రైతుల వారీగా సాగు విస్తీర్ణం

నెక్కొండ : ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సాయపడనుంది.. పండించిన పంట అమ్ముకునేందుకు నానా తంటాలు పడేది.. కానీ ఇప్పుడు అన్నదాతలు సాగు చేస్తున్న ప్రతి పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి మార్కెటింగ్ పరంగా ఏ ఇబ్బంది లేకుండా చేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గుంట భూమి లెక్క పక్కాగా ఉండాలని వ్యవసాయ శాఖకు దిశా నిర్దేశం చేసింది. ఇక ప్రభుత్వం ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌ను అభివృద్ధి చేసి ప్రతి రైతుల పంట విస్తీర్ణం వివరాలను నమోదు చేస్తోంది. పోర్టల్ యూ.ఆర్.ఎల్ డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ. ఆర్‌వైటీహెచ్‌యుటీఏఎస్‌డీయూ. టీఈఎల్ఏఎస్‌జీఏఎస్‌వీ. జీఓవీ.ఐఎస్ ను పంట సాగు విస్తీర్ణం డేటాను ప్రణాళిక, సేకరణ, మౌలిక సదుపాయాల నిర్మాణ అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఈ దృష్ట్యా రైతుల వారీగా పంట పంటలను కచ్చితంగా నమోదు చేయడం అనివార్యమైంది. మండలంలో నీటి వనరులతో ప్రతి సంవత్సరం వానాకాలం, యాసంగి సీజన్‌లలో పత్తి, వరి, మొక్కజొన్న, పసుపు, తదితర పంటలు సాగు చేస్తారు. కర్షకులు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు వాటికి మార్కెట్ సౌకర్యం, తదితర వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిన విషయం విదితమే. రైతులు ఏఏ పంటలు సాగు చేస్తున్న విషయం నమోదు ప్రక్రియ మండలంలో కొనసాగుతోంది. పంటల నమోదు ప్రక్రియలో భాగంగా ఒక గ్రామంలో ఎన్ని ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అందులో ఏఏ రకాలు వేశారు. ఎంత విస్తీర్ణంలో పండిస్తున్నారు. రైతులు ఎంత మంది ఉన్నారు. ఇలా ప్రతి అంశం పూర్తయిన తర్వాత వ్యవసాయ శాఖ అధికారులు సంబంధిత జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించనున్నారు. ఆ గ్రామంలో అన్నదాత ఏ పంట వేశారో తెలియడంతో పాటు నమోదు కాని వారు మళ్లీ రాయించుకునే వీలుంటుంది. పండించిన పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యంతో పాటు పరిశ్రమలను తీసుకొచ్చి ప్రాంతాల అభివృద్ధి కోసం ఈ కార్యాచరణను రూపొందించినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు.


పంటల నమోదును పరిశీలిస్తున్న ఏఈ నాగరాజు

మండలంలో సాగు వివరాలు..
మండలంలోని రైతులు యాసంగిలో సాగు చేస్తున్న పంటల వివరాలు ఎకరాల్లో.. వరి నారు దశలో 3,302, నాట్లు వేసినవి 13,300, మొక్కజొన్న 11,450, వేరుశనగ 12ఎకరాలు, పత్తి 10ఎకరాలు, ఆయిల్‌పామ్ 180 ఎకరాల్లో, కూరగాయల సాగు 29 ఎకరాలు, చిరుధాన్యాలు, 25ఎకరాలు సాగవుతున్నాయని అధికారుల వద్దలెక్క తేలింది. దీంతో రైతుల సాగు లెక్క నమోదు చేశారు.

చిరుధాన్యాల సాగు పెరుగుతోంది


వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మండలంలో చిరుధాన్యాల సాగు పెరుగుతోంది. అదే విధంగా ఇతర పంటలను మార్పునకు ఆయిల్‌పామ్ పంటలపై రైతులను సాగు చేస్తున్నారు. ప్రతి రైతు పంటల నమోదు చేసుకోవాలి. ప్రభుత్వ రాయితీలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు నమోదు ఎంతగానో దోహదపడుతుంది.

- పొల్లేటి రవి, రైతు, అలంకానిపేట

వారంలో పంటల సర్వే పూర్తి


మండలంలో పంటల నమోదు కొనసాగుతోంది. మరో వారంలోగా పూర్తి చేస్తాం. ఏఈఓలు ప్రతి గ్రామంలోని పంట పొలాల్లోకి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. యాసంగిలో వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశగన, ఆయిల్‌పామ్, కూరగాయల సాగు చేస్తున్నారు. ప్రక్రియ పూర్తి అయిన తర్వాత గ్రామ పంచాయతీల్లో జాబితాను ప్రదర్శిస్తాం. ఇందులో పేర్లు లేని వారు మళ్లీ నమోదు చేసుకునే అవకాశం ఉంది.

- ఎగిడి నాగరాజు, ఏఈ

క్లుప్తంగా

నియామకం



నెక్కొండ : నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా స్థానిక వార్డు సభ్యురాలు రామారపు శిరీషను నియమించినట్లు జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ గురువారం ప్రకటనలో తెలిపారు. అనంతరం శిరీష మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, బీసీ సెల్‌జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డుపల్లి యాదగిరి, రామారపు రాము ఉన్నారు.

సూచనలు పాటించాలి



వర్ధన్నపేట : వర్ధన్నపేట శివారులోని వరి పంట క్షేత్రాలను గురువారం ఏఓ రాంనర్సయ్య సందర్శించి రైతులకు సలహాలు సూచనలు చేశారు. యాసంగి వరి పంట చిరుపొట్టదశలో ఉందని పైర్లలో మొగి పురుగు, చవుడు, నాచు, సల్ఫేట్ ధాతు విష ప్రభావం, జింక్‌లోపంతో పాటు చీడ పీడలు ఆశించాయని వాటి నివారణకు రైతులు సలహాలు సూచనలు తీసుకోవాలని రాంనర్సయ్య అన్నారు. రైతులు తమ పంట క్షేత్రంలో ఎలాంటి తెగుళ్లు ఆశించాయి. చీడ పీడలు వంటి వివరాలు తమ దృష్టికి తీసుకువస్తే వాటి నివారణ మార్గాలను తెలపడం జరుగుతుందన్నారు.

విద్యార్థికి అభినందన



వర్ధన్నపేట : మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వనునూరి రోహిత్ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడని హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 1న గోనె మల్లయ్య ట్రస్ట్ లక్నెపల్లి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో రోహిత్ షీల్డ్, డిక్షనరీ, ప్రశంసపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో సర్పంచ్ అరెల్లి ప్రవంతి అంజన్‌రావు, ఎంపీటీసీ రజిత, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

రోడ్డు పనులు ప్రారంభం



ఖానాపురం : మండలంలోని మంగళవారిపేటలో మట్టి రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న డీసీఎం వ్యాన్


మలుపు వద్ద పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

వర్ధన్నపేట : మలుపు వద్ద వేగాన్ని నియంత్రించలేకపోవడంతో విద్యుత్ స్తంభాన్ని డీసీఎం వ్యాన్ ఢీ కొట్టిన సంఘటన గురువారం ఇల్లందలో చోటుచేసుకుంది. మండలంలోని ఇల్లంద గ్రామ వివేకా కాలనీ సమీపంలో జాతీయ రహదారి మలుపు వద్ద వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో స్తంభం విరిగి పడింది. దీంతో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ మలుపు వద్ద తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్ధన్నపేట సీఐ సదన్‌కుమార్, ఎస్సై రామారావు సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డు ప్రమాద నివారణకు చర్యలు చేపట్టారు.

మీటర్లు అమర్చుకోవాలి

నడికూడ : ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన వినియోగదారులకు నెలకు 101 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ దేవేందర్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆ శాఖ సిబ్బందితో కలిసి గురువారం ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యుత్ సదుపాయం లేని వ్యక్తులు దరఖాస్తు చేసుకుని విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

'కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి'


వర్ధన్నపేట: మాట్లాడుతున్న నమిండ్ల శ్రీనివాస్

వర్ధన్నపేట : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం హాత్ సే హాత్ జోడో పాదయాత్ర ఉప్పరపల్లి గ్రామానికి చేరుకోగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ ప్రజలతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధిలో ఎంతో వెనకబడి పోయిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందిస్తామన్న కేసీఆర్ నేడు అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారన్నారు. ఏసీడీ చార్జీల పేరుతో సామాన్య, మధ్య తరగతి విద్యుత్ వినియోగదారుల నుంచి వేలాది రూపాయలు అదనంగా వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు డబుల్‌బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ఎవరికీ ఎలాంటి సంక్షేమ పథకాలు అందించకుండా కేవలం బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యుల అభివృద్ధికి దోహదపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎద్దు సత్యనారాయణ, జక్కి శ్రీకాంత్, మల్లెపాక సమ్మయ్య పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి
చెన్నారావుపేట : దొంతి మాధవరెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్ నాయక్, యూత్ అధ్యక్షుడు బండి హరీష్‌యాదవ్‌లు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వారు విలేకరుల మాట్లాడుతూ ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి చేపట్టిన యాత్ర ఉదయం 8గంటలకు అక్కల్‌చెడకు చేరుకుంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాంఘిక శాస్త్ర పరీక్షపై అవగాహన

వరంగల్ (పర్వతగిరి) : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు నూతన మోడల్ పేపర్లపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ఆడెపు రవీందర్ మోడల్ పేపర్‌పై అవగాహన, కీలక అంశాలను వివరించారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం వరకు 8 పీరియడ్స్‌లో 21పాఠాలకు సంబంధించిన కీలక అంశాలపై వివరణ, 15సెకండ్లలో భారతదేశ పటం, 30సెకండ్లలో ప్రపంచ పటం గీయడం ఎలాగో నేర్పించారు. విద్యా ప్రమాణాలకు అనుగుణంగా జవాబు రాయడం వివరించిన తీరు విద్యార్థులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇంతటి విషయ నిపుణుడిని పంపిన డీఈఓకు పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

దాతలు సాయం చేసి ఆదుకోండి..

- దయనీయ స్థితిలో యువకుడు
- కిడ్నీలు చెడిపోయి దీన స్థితికి
- కిడ్నీలు ఇవ్వడానికి తల్లి సమ్మతి


రాజును పరామర్శించి అతడి తల్లికి సాయం అందిస్తున్న, సుంకరి శివ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన పోలెబోయిన రాజు కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో అతడి రెండు కిడ్నీలు చెడిపోయాయి. దీంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో అయన చికిత్స పొందుతున్నాడు. రాజుకు అతడి తల్లి కిడ్నీలు సరిపోతాయని, వాటిని మార్పిడి చేసి అమర్చడానికి వైద్యులు సిద్ధమవుతున్నారు. అతడి దీన పరిస్థితిని గమనించి 16వ డివిజన్ కార్పొరేటర్ మనీషా భర్త బీఆర్‌ఎస్ నాయకుడు సుంకరి శివ గురువారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం చికిత్స నిమిత్తం రూ. 10వేల సాయం అందించారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతో వైద్యసహాయం అందేలా చూస్తానని శివ తెలిపారు. సాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని, పోలెబోయిన రాజు సెల్ 99080 20673 నంబర్‌కు ఫోన్ పే లేదా గూగుల్‌పే చేయాలని బాధితుడి బంధువులు కోరుతున్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలి


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నెక్కొండ : పాఠశాల దశలోనే విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని హనుమకొండ రీజనల్ సైన్స్ సెంటర్ ప్రతినిధులు సాయిని అశోక్ కుమార్, కె.రాజన్న తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (టీఎస్ సీఓఎస్టీ) ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గణితం పట్ల అభిరుచి పెంపొందించుకుంటే అపోహలకు తావుండదన్నారు. ఉపాధ్యాయులు గణితంలో మెళకువలను నేర్పి, సులభ విధానంలో విద్యార్థులకు బోధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో ప్రథమ బహుమతి పి. ఆసీఫ్, ద్వితీయ బి.నిఖిల్‌వర్మ, తృతీయ కె.సాయిరాం, ఉపన్యాస విభాగంలో ప్రథమ బి.నిఖిలవర్మ, ద్వితీయ బి. ఉత్తమ్‌కుమార్, తృతీయ పి.ఆసీఫ్, క్విజ్ పోటీల్లో ప్రథమ ఆర్. చందన, ద్వితీయ స్థానంలో పి.ఆసీఫ్ నిలిచారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రంగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



రాయపర్తి : కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెర్కవేడు గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నాల తారశ్రీరాజబాబు, ఎంపీటీసీ బండి అనూషరాజబాబు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, నాయకులు అకుల సమ్మయ్య, వెంకటచారి, ఎండీ అంజద్, గారె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

సంగెం : మండలంలోని వంజరపల్లిలో చలో హైదరాబాద్ కార్యక్రమ కరపత్రాలను ఆరె కుల సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 15వ తేదీన హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆరె కుల ఆత్మగౌరవ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరెకుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు హింగ్లే శివాజీ, ఉపాధ్యక్షుడు కొడగాని నర్సింగరావు,నాయకులు మోర్తాల చందర్‌రావు, కొడగాని శంకర్‌రావు, సాంబశివరావు, మాజీ సర్పంచ్ శంకర్‌రావు, జెండా వీరేష్, కొడగాని సారంగం, సోమిడి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉర్సు

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో మూడు రోజులుగా సాగిన యాకుబ్‌షావలి ఉర్సు ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఉర్సు ఉత్సవాల చివరి రోజు దర్గాలో ముజావర్లు పూజలు నిర్వహించగా పలు గ్రామాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉర్సు ఉత్సవాలు సజావుగా కొనసాగడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న దేవేందర్

నర్సంపేట రూరల్ : పట్టణంలోని బీసీ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులకు జరిగిన ఫుడ్ పాయిజన్‌పై తప్పుడు రిపోర్టులిచ్చిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలో ఏబీవీపీ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. పట్టణంలోని వల్లభ్‌నగర్ బీసీ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఇటీవల 11 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగి మూడ్రోజులు గడిచినా ఇప్పటి వరకు ప్రిన్సిపాల్ కుమారస్వామి ఈవిషయాన్ని బయటకు రానివ్వడం లేదన్నారు. విషయం బయటకు తెలిస్తే ఉద్యోగాలు పోతాయేమోనన్న ట్రీట్‌మెంట్ అందించకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న వరుస ఫుడ్ పాయిజన్లపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ నర్సంపేట నగర కార్యదర్శి పొన్నాల శశికుమార్, చింతం సిద్ధు, ఓంసాయి, గణేశ్, మహేశ్, సంతోశ్, కిరణ్, ఉమేశ్, రాజేశ్, రంజిత్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ


గీసుకొండ : కొమ్మాల గ్రామపంచాయితీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ ప్రభాకర్

గీసుకొండ : మండలంలోని కొమ్మాల గ్రామపంచాయతీలో రూ.50 లక్షలకు పైగా నిధుల దుర్వినియోగం అయినట్లు పలువురు ఇటీవల కలెక్టర్, డీపీఓకు ఫిర్యాదు చేయడంతో గురువారం డీఎల్‌పీఓ ప్రభాకర్ విచారణ చేపట్టారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శితో పాటు పీఆర్‌ఏఈపై చర్యలు తీసుకోవాలన్నారు. మూడేళ్లుగా పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని, ఇప్పటికైనా సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని 5వ వార్డు సభ్యుడు భోగి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సాయిలి ప్రభాకర్, టి.బ్రహ్మచారి డిమాండ్ చేశారు. సర్పంచ్ వీరాటి కవిత, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఎంపీఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

సర్పంచ్‌పై వార్డు సభ్యుల ఫిర్యాదు
సంగెం : మండలంలోని మొండ్రాయి గ్రామాభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న సర్పంచ్ గూడ కుమారస్వామిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌కు వార్డు సభ్యులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఉప సర్పంచ్ పెండ్లి శారదకుమారస్వామి ఆధ్వర్యంలో వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామసభల్లో ఆమోదించిన తీర్మానాల పనులు చేయించడంలో సర్పంచ్ తీవ్ర జాప్యం చేస్తున్నాడన్నారు. చేసిన పనులకు అభ్యంతరం తెలుపుతూ చెక్కులపై సంతకాలు చేయకుండా మనోవేదనకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. జీపీ నుంచి రూ.4లక్షలు తీసుకుని శ్మశానవాటిక పనులు పూర్తి చేయకపోవడంతో అదనపు కలెక్టర్ షోకాజ్ నోటీస్ సైతం ఇచ్చారన్నారు. మిషన్ భగీరథ నీరు ఇప్పటికి ఇంటింటికి రావడం లేదన్నారు. గ్రామ పల్లె ప్రకృతివనంలో తక్కువ మొరం పోసి ఎక్కువ పోసినట్లు, వీధి లైట్లు ఎక్కువ తీర్మానం చేయాలని వేధిస్తున్నాడని తెలిపారు. ట్రాక్టర్ డీజిల్‌కు గతంలో రూ.40వేలు నెలకు ఖర్చు చేసినట్లు రికార్డులు చేయించుకున్నాడన్నారు. 500 మొక్కలు నాటి 1,500 నాటినట్లు డబ్బులు డ్రా చేసుకున్నట్లు వాపోయారు. సర్పంచ్ అక్రమాలపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అనుముల లింగమూర్తి, కొనకటి బాలరాజు, లెంకలపల్లి లావణ్య, పరికి ఎలీష, సింగిరెడ్డి జ్యోతి పాల్గొన్నారు.

పల్లెల్లో గుడుంబా ఘాటు

- యథేచ్ఛగా తయారీ, అమ్మకాలు
- మాముళ్ల మత్తులో అధికారులు
- బానిసవుతున్న యువత, వృద్ధులు


గుడుంబా తయారు చేస్తున్న దృశ్యం

సంగెం : గుడుంబా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది.. కానీ మారుమూల గ్రామాలు, తండాల్లో నాటుసారా(నిషేధిత గుడుంబా) ఘాటు గుప్పుమంటోంది.. సంగెం మండలం వరంగల్ నగరానికి సమీపంలో ఉండడం వల్ల గుడుంబా తయారీ, విక్రయాల వ్యాపారం జోరుగా సాగుతోంది. మాముళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్య వైఖరితో మండలంలో భారీ స్థాయిలో గుడుంబా తయారీ, అమ్మకాలు మూడు కిలోల బెల్లం, అరు లీటర్ల గుడుంబాగా వర్ధిల్లుతోంది. గుడుంబా తయారీకి అవసరమైన బెల్లం మహారాష్ట్ర నుంచి తీసుకు వచ్చి ఎక్కువ మొత్తంలో నిల్వలు చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. నామమాత్రపు దాడులు, ఎక్కువ మొత్తంలో గుడుంబా, పానకం, నల్లబెల్లం, పటిక దొరికిన రికార్డుల్లో తక్కువగా లభించిందని, నిందితులు దొరికినా పారిపోయారని అధికారులు చేతులు దులుపుకుంటుండడంతో వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందని పలువురు బాధిత కుటుంబాలు ఆవేదన చెందుతున్నారు.

20లోనే 60 ఏళ్లు..
పలు గ్రామాల్లో గుడుంబా వ్యసనానికి బానిసలైన యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తప్పతాగి ఆరోగ్యం క్షీణించి మండలంలో పలువురు మృత్యువాత పడుతున్నారు. దీంతో యుక్తవయస్సులో 20 ఏళ్లకే భర్తలను కోల్పోయి వితంతువులుగా మారుతున్నారు. మండలంలో 2,496 మంది వితంతువులున్నారు. వీరిలో 80 శాతం మంది యుక్తవయస్సులో భర్తలను కోల్పోయిన వారే. ఇలాంటి వారుతమ కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కులేక పలు కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుడుంబా తయారీ, అమ్మకాలను నియంత్రించాలని పలువురు వేడుకుంటున్నారు.

దాడులు నిర్వహిస్తున్నాం..
గుడుంబా స్థావరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. బెల్లం అమ్మకుండా బైండోవర్ సైతం చేపడుతున్నాం. తండాలు, గ్రామాల్లోను గుడుంబా తయారీ, అమ్మకాలపై నిఘా పెంచుతాం. నాటుసారా నియంత్రణకు మహిళలు, యువత ముందుకు రావాలి. గుడుంబా తయారు చేసినా, అమ్మినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. తయారీ, అమ్మకాలు మానుకోవాలి లేనిచో చర్యలు తప్పవు.

-పవన్ ఎక్సైజ్ సీఐ, వర్ధన్నపేట

'ఆర్భాటమే తప్ప అభివృద్ధి శూన్యం'

దామెర : అధికార పార్టీ చేస్తున్నది ఆర్భాటమే తప్ప చేస్తున్న అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి తెలిపారు. మండలంలోని పసరగొండలో గురువారం ఆయన పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాల మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డు, నర్సరీ, శ్మశానవాటికలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం పురుగులు పట్టిన బియ్యంతో తయారు చేసిన భోజనం పెడుతున్నారని మండిపడ్డారు. తాగడానికి సరైన నీటివసతి కూడా లేదన్నారు. ఆర్భాటంగా ప్రారంభించిన క్రీడా ప్రాంగణం, శ్మశానవాటిక, నర్సరీల పర్యవేక్షణ కరువైందని ఆయన ధ్వజమెత్తారు. కోట్ల రూపాయల నిధుల పేరుతో ప్రజాధనాన్ని వినియోగించి చేపట్టిన అభివృద్ధి పనులను వారుకులోకి తీసుకురాకపోవడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థపాలనకు నిదర్శనమన్నారు. ఆయన వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెపాక శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రజినీకర్‌రెడ్డి, ఎంపీటీసీ శనిగరం కళ సుధాకర్, నాయకులు అమ్మ రమేష్, సుధాకర్, కుమారస్వామి, సురేష్, మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై పట్టింపేది?



వరంగల్ (పర్వతగిరి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులపై పట్టింపు లోపిస్తోందని అనడానికి ఈ ఫొటోనే ఉదాహరణ.. మండలంలోని చెరువుకొమ్ముతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 18మంది విద్యార్థులు ఉండగా హెచ్‌ఎంతో పాటు మరో ఉపాధ్యాయుడు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఎం సెలవులో ఉండగా ఉపాధ్యాయుడు పనుల నిమిత్తం ఎమ్మార్సీకి వెళ్లాడు. ఎమ్మార్సీకి వెళ్లిన క్రమంలో సీఆర్‌పీలు విధులు నిర్వహించాలి. కానీ పాఠశాల సమయంలో ఎవరూ లేకపోవడం విద్యార్థులకు రక్షణ లేకుండా పోయింది.